సాక్షి
బాపట్ల
సోమవారం ; 18 ; ఆగస్టు ; 2025



వైభవంగా గంగానమ్మ జాతర

తాడేపల్లి రూరల్: మంగళగిరి మండలం ఆత్మకూరులో గంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు.



ఘనంగా అమ్మవారికి బోనాలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో పోలేరమ్మకు ఆదివారం బోనాలు ఘనంగా సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తెచ్చారు.

మహాలక్ష్మమ్మ చెట్టు వార్షికోత్సవం



నరసరావుపేట: స్థానిక కోటబజార్‌లో గల మహాలక్ష్మమ్మచెట్టు వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు జలబిందెలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.


న్యూస్‌రీల్

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దఎత్తున చేరుకున్నారు. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు నాగసిరి లాంచీ, శాంతిసిరి లాంచీలలో వెళ్లారు. అక్కడి చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, యాంపీ స్టేడియం, శ్రీ రంగనాథస్వామి దేవాలయాలను సందర్శించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. పర్యాటకులు నాగార్జునకొండను సందర్శించటంతో లాంచీస్టేషన్‌కు రూ.1,88,150 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

పులిచింతల నుంచి భారీగా నీటి విడుదల



అచ్చంపేట: ఎగువ నాగార్జునసాగర్, కృష్ణానదీ పరీవాహక ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రం ఏడు గంటల వరకు పులిచింతల ప్రాజెక్టుకు 2,08,330 క్యూసెక్కులు వచ్చి చేరింది. దిగువకు ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 1,93,855 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 38.4077 టీఎంసీలు ఉంది.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన కందుల లక్ష్మణరావు కుటుంబం ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసిన కందుల లక్ష్మణరావు, విజయ వెంకట లక్ష్మి, కుమారుడు, కోడలు రామప్రసాద్, ప్రభాచంద్ర, మనవడు, మనవరాలి పేరిట రూ. 1,00,116 విరాళాన్ని నిత్యాన్నదానానికి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఏఈవో వెంకటరెడ్డి దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం నిండిపోయింది. శ్రావణమాసం ఆదివారం సెలవుదినం కావడంతో తెలుగు ఉభయ రాష్ట్రాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హైవేపై స్తంభించిన ట్రాఫిక్



రొంపిచర్ల: రొంపిచర్ల సమీపంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆదివారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. సుబ్బయ్యపాలెం క్రాస్‌రోడ్‌పై భారీ లారీలో డీజిల్ అయిపోయి మరమ్మతులకు గురైంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూడా వాహన చోదకులు సమాచారం అందించారు. ఎవరూ స్పందించకపోవటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పచ్చ నేతల కర్ర పెత్తనం

- గ్రామాల్లో యథేచ్ఛగా దందా
- రేషన్ డీలర్లకు బెదిరింపులు
- అధికారులతో కేసులు నమోదు
- నియోజకవర్గంలో 40 షాపుల పైగా 6- ఏ కేసులు
- ఒక్కో దుకాణదారుడు రూ.1.50 లక్షలు ఇవ్వాలంటూ హుకుం
- పంచాయతీ కార్యాలయాల్లో తిష్ట
- అధికారులకు ఆదేశాలు జారీ



చీరాల టౌన్: చీరాల నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండా పోతోంది. మద్యం నుంచి ఇసుక వరకు కాసులు పిండుకుంటున్న నేతలు తాజాగా రేషన్ డీలర్లపై దందా చూపిస్తున్నారు. 'ప్రభుత్వం మాది.. ఇన్నాళ్లు రేషన్ డీలర్ షిప్ ద్వారా బాగా సంపాదించారు.. ఇక మీ ఆటలు సాగవు.. దుకాణాలు మా వారికే చెందాలి.. లేదంటే మాకు కప్పం కట్టాల్సిందే' అంటూ బెదిరిస్తున్నారు. అధికారులతో కేసులు పెట్టించి షాపులను 'మా వారికి అప్పగిస్తాం. ఇక మీ ఇష్టం' అంటూ చెలరేగిపోతున్నారు.

నియోజకవర్గంలో 146 దుకాణాలు

చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్ మండలంలో 99 రేషన్ దుకాణాలు, వేటపాలెం మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో 47 రేషన్ దుకాణాలు కలిపి 146 ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 40 వరకు బలవంతపు రాజీనామాలు, అధికారుల అండతో 6-ఏ కేసులు నమోదు చేయించారు. ఎన్నో ఏళ్లుగా రేషన్ దుకాణాలను నడుపుకుంటున్న వారి నుంచి బలవంతంగా గుంజుకుని టీడీపీ నాయకులకు అప్పగించారు.

డీలర్లపై పగ

చీరాల నియోజకవర్గంలో రేషన్ దుకాణం నడుపుకోవాలంటే అధికార పార్టీ నాయకుల ఆమోదం తప్పనిసరిగా మారింది. గత ప్రభుత్వ హయాంలో దుకాణాలను నిర్వహించిన డీలర్లపై ప్రస్తుత కూటమి నాయకులు పగబట్టారు. స్వచ్ఛందంగా తప్పుకోవాలని, లేనిపక్షంలో రూ.1.50 లక్షలు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీనిని వ్యతిరేకించే వారిపై దాడులు చేయించి 6-ఏ కేసులు నమోదు చేయిస్తున్నారు. తాత్కాలిక డీలర్‌షిప్‌నకు కూడా టీడీపీ అనుచరుల నుంచి కూడా ఒక్కో దుకాణానికి కొత్తగా రూ.1 లక్ష వసూలు చేస్తున్న పరిస్థితులు చీరాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

ఉదాహరణలు ఎన్నో..

చీరాల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఈపురుపాలెంలో ఏడు నెలలుగా పలువురు డీలర్లపై కేసులు నమోదు చేయించి టీడీపీ కార్యకర్తలకు షాపులు కట్టబెట్టారు. ఒక్కో రేషన్ దుకాణం నుంచి రూ.1.25 లక్షలు వసూలు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దీన్నే ఆదాయ వనరుగా మార్చుకుని మరికొంత మంది డీలర్లపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొన్నేళ్లుగా డీలర్‌గా పని చేస్తున్న వ్యక్తి చనిపోతే ఆ దుకాణాన్ని అతని భార్య నిర్వహిస్తోంది. గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి, మరో నలుగురు టీడీపీ నాయకులు ఆమెను బెదిరించారు. తమ వారికి దుకాణం ఇవ్వాలని లేదా రూ.1.50 లక్షలు ఇస్తే నిర్వహణ చేసుకోవచ్చని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆ మహిళా డీలర్ స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధిని కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. టీడీపీ నాయకులు పెడుతున్న ఇబ్బందులు, డిమాండ్లను ప్రజాప్రతినిధికి విన్నవించుకోగా, ఆయన విచారణ చేయిస్తున్నారు. పట్టణానికి చెందిన పలువురు డీలర్లను బెదిరించినా వారు పట్టించుకోకపోవడంతో అధికారుల అండతో 6ఏ కేసులు నమోదు చేయించారు. షాపుల్ని టీడీపీకి చెందిన వారికి కట్టబెట్టారు.

మాకే ప్రొటోకాల్ ఇవ్వాలి

గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు లేకపోవడంతో అధికార టీడీపీ నాయకులు ఆడిందే ఆటగా మారుతోంది. గ్రామస్థాయిలో ఏ కార్యక్రమం జరిగినా కూడా ప్రొటోకాల్ లేని వారికి కుర్చీలు వేసి రాచమర్యాదలు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రతి పనిని తమ వారికే చేయాలంటూ అధికారులకు ఆదేశాలిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు తోటవారిపాలెంలో తెలుగు తమ్ముళ్లు తన్నుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం.

గ్రామాల్లో రెచ్చిపోతున్నారు



పంచాయతీలను పప్పు బెల్లాల్లా టీడీపీ నేతలు పంచుకుని తింటున్నారు. పార్టీ నాయకులు చెప్పిన వాటికే గ్రామ సభల తీర్మానాలు చేయించేలా అధికారులు కూడా వ్యవహరిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో టీడీపీ నాయకులు తిష్ట వేసి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన జరుగుతోంది. దీంతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులను మచ్చిక చేసుకుని గ్రామాల పాలన టీడీపీ నాయకులే చేస్తున్నారు. ఆఖరుకు గ్రామ స్థాయి నాయకులు కూడా ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తున్నారు. గ్రామ పంచాయతీల వారీగా వాట్సాప్ గ్రూపులు పెట్టుకున్నారు. తమ ఆదేశాలను మాత్రమే ఉద్యోగులు అమలు చేయాలని, లేకపోతే ప్రజాప్రతినిధికి చెబుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. చీరాల పట్టణానికి ఆనుకుని ఉన్న రెండు గ్రామ పంచాయతీలను ఒక నాయకుడు అడ్డాగా మార్చుకుని పరిపాలన చేస్తున్నాడు. అధికారులు, సచివాలయాల ఉద్యోగులు సైతం అతని మాటనే శిరసా వహిస్తున్నారు.

ఆగడాలకు అడ్డుకట్ట పడేనా?

చీరాల మండలంలోని గ్రామాల్లో అధికార పార్టీ అండతో సెటిల్‌మెంట్లు, రేషన్ డీలర్లకు బెదిరింపులు, ఆశా వర్కర్ల తొలగింపు, వీఏఓల తొలగింపులు యథేచ్ఛగా సాగుతున్నాయి. అవుట్ సోర్సింగ్ పనులు చేస్తున్న వారిని తొలగించి టీడీపీ నాయకులే వారి కార్యకర్తలకు అమ్ముకుంటున్నారు. చిన్న ఉద్యోగాలు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుని జీవించే బడుగులు టీడీపీ నాయకుల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు చెందిన ముఖ్య అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే చీరాల్లో ఈ ఆగడాలకు ఫుల్‌స్టాప్ పడుతుంది.

అతివలకు 'నాన్‌స్టాప్' అబద్ధాలు

- 'ఉచిత ప్రయాణం' పేరిట మహిళలకు మరో కుచ్చుటోపీ
- నరసరావుపేట డిపోలో ఎక్స్‌ప్రెస్‌లు నాన్‌స్టాప్‌గా మార్పు



నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం' (స్త్రీ శక్తి) పథకం మరో మోసమని తేలిపోయింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు ఆయా సర్వీసుల్లో కేవలం పట్టణాలకు దగ్గరలో ఉన్న గ్రామాలు లేదా 40 నుంచి 60 కిలోమీటర్ల దూరం వరకు మాత్రమే ప్రయాణించే అవకాశం మహిళలకు వర్తింపచేసింది. మరోవైపు ఎక్స్‌ప్రెస్‌లను నాన్‌స్టాప్‌గా మార్చి ఎక్కనీయడం లేదు. నరసరావుపేట డిపోలో పథకం అమలు తీరును పరిశీలిస్తే కూటమి ప్రభుత్వం కుటిల వైఖరి వెల్లడవుతోంది. మొత్తం బస్సులు 84 ఉండగా... వీటిలో 20 అద్దె బస్సులు ఉన్నాయి. 40 పల్లె వెలుగు కాగా.. ఎక్స్‌ప్రెస్ బస్సులతో నరసరావుపేట-గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసులను నడుపుతున్నారు. శ్రావణ మాసంతోపాటు పెళ్లిళ్ల సీజన్ కావటంతో బస్సుల్లో రద్దీ అధికంగానే ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆరు బస్‌డిపోలు ఉండగా వాటిలో 489 బస్సులు ప్రజారవాణా చేస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు 73, పల్లెవెలుగు 325 బస్సులు ఉచిత ప్రయాణానికి అనుకూలంగా ఉన్నాయి. 91 బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదని అధికారులు చెప్పారు. కానీ ఎక్కువ బస్సులు నాన్‌స్టాప్ అని చెబుతూ అధికారులు ఎక్కనీయడం లేదని మహిళలు వాపోతున్నారు.

మచ్చుకైనా కనిపించని 'క్రమశిక్షణ'

- జీజీహెచ్‌కు జనవరిలో వచ్చిన ఫైల్ జూలై నెలలో ప్రత్యక్షం
- క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైల్ తొక్కిపెట్టిన వైనం
- ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు
- ఒకరికి బదులు మరొకరిపై క్రమశిక్షణ చర్యలకు యత్నం



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కార్యాలయ అధికారులు, ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ ఏడాది జనవరి 10న రిజిస్టర్ పోస్ట్ ద్వారా సదరు ఉత్తర్వులు వచ్చాయి. జూలై 30వ తేదీన వాటిని అందుకున్నట్లు తపాలా సెక్షన్‌లో నమోదైంది.

సంబంధం లేని వారిపై చర్యలకు సిద్ధం

రాష్ట్ర వ్యాప్తంగా బోధన ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు అధికార కేంద్రంగా పిలిచే డీఎంఈ కార్యాలయం నుంచి వచ్చిన ఫైల్ ఏడు నెలలుగా ఎక్కడ ఉందో ఎవరికీ తెలియకపోవటం ఆస్పత్రి అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఏడు నెలలు ఆలస్యంగానైనా ఫైల్ ప్రత్యక్షం ఐనా... ఒకరికి బదులు మరొకరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారని బాధితుడు వాపోతున్నారు. డైట్ సెక్షన్‌కు సంబంధించిన ఫైల్ మిస్సింగ్ సంఘటనలో తనను బాధ్యుడిగా చేస్తూ తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆ ఫైల్స్ నిర్వహణ తనకు కేటాయించిన విధుల్లో లేదని లిఖిత పూర్వకంగా ఆధారాలు సైతం అధికారులకు సమర్పించినా చర్యలకు సిఫార్సు చేసి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో అసలైన బాధ్యులపై చర్యలకు ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలకు గండి

కార్యాలయంలో ఇప్పటికే పలువురు కిందిస్థాయి ఉద్యోగుల పదోన్నతుల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. నోటిఫికేషన్లు ఇస్తున్నారేగానీ, వారికి పదోన్నతి ప్రయోజనాలు రాకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రిలో పనిచేస్తూ చనిపోతే వారి కుటుంబ సభ్యులకు, పదవీ విరమణ చేసిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చాలా మందికి పెండింగ్‌లో ఉన్నాయి. కారుణ్య నియామకాల్లో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. జీజీహెచ్ కార్యాలయం పనితీరుపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రిలో పరిపాలన సవ్యంగా జరిగేలా చూడాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

టీడీపీలో 'చైర్మన్' చిచ్చు

తాడికొండ: గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం తాడికొండ మండల బండారుపల్లి కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పదవిపై తెలుగుదేశం పార్టీలో తీవ్ర కలకలం రేపుతోంది. ఎమ్మెల్యే కార్యాలయంలో అంతా తానే అయి నడుపుతున్న షాడో నేత ఒకరు ఇలాంటి నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నాడంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేయడమే దీనికి కారణం. బండారుపల్లి గ్రామానికి చెందిన గుంటుపల్లి పానయ్యని సొసైటీ చైర్మన్‌గా నియమించారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామంలో ఉన్న టీడీపీలోని మూడు గ్రూపులు ఏకమయ్యాయి. సోమవారం ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉండగా... అదే జరిగితే తామేంటో చూపిస్తామంటూ వారందరూ వీరంగం సృష్టించారు. ఈ వ్యవహారంపై ఆదివారం గుంటూరు ఎంపీ పెమ్మసాని కార్యాలయంలో పెద్ద పంచాయితీయే జరిగింది. ఈ పంచాయితీలో గ్రామానికి చెందిన వంద మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చైర్మన్ పదవి కేటాయింపుపై బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేశారు.

విభజించి మరీ పదవుల విక్రయం

షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న నేత గ్రామాల్లో గ్రూపులుగా విభజించి పార్టీని నాశనం చేస్తున్నాడని, ఇప్పటికే గ్రామంలో మూడు గ్రూపులు ఉన్నాయని స్థానిక నేతలు వాపోయారు. 2023 వరకు అసలు పార్టీ సభ్యత్వమే లేని వ్యక్తికి ఎలా సొసైటీ పదవి అప్పగిస్తారంటూ నిప్పులు చెరిగారు.

ఎంపీ సోదరుడి సమక్షంలో జరిగిన ఈ పంచాయితీలో కనీసం మూడు నెలలైనా అతనికి పదవి ఇచ్చి తదనంతరం రాజీనామా చేయిద్దామంటూ ప్రతిపాదించినా.. మూడు నిమిషాలు కూడా సీటులో కూర్చుంటే ఒప్పుకోబోమని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటి వరకు మూడు గ్రూపులుగా ఉన్న టీడీపీ వర్గం అంతా ఏకమై ఎదురుతిరగడంతో ఏం చేయాలో పాలుపోక ఎమ్మెల్యే కార్యాలయం, షాడో ఎమ్మెల్యే తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. తమవైపు నుంచి నలుగురు వ్యక్తులను రాజీ చర్చలకు పంపించినా వారు కూడా సమాధానం చెప్పలేక వెనుదిరిగారు.

ఇంజినీరింగ్‌కు ఫుల్ డిమాండ్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఇంజినీరింగ్ సీట్లు దాదాపు భర్తీ
- 36 కాలేజీల్లో తొలి విడత కౌన్సెలింగ్‌లోనే 90 శాతానికిపైగా భర్తీ
- ప్రస్తుతం చివరి విడతలో మిగతా సీట్ల భర్తీకి సన్నాహాలు

ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష అయిన ఏపీ ఈఏపీసెట్-2025లో అర్హత సాధించిన ఎంపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా మొదటి విడతలో సీట్లు కేటాయించారు. దాదాపు 90 శాతానికిపైగా సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.



ఇంజినీరింగ్ విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : రెండో విడతలో మిగిలిన సీట్ల కౌన్సెలింగ్ కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చేపట్టిన ప్రక్రియ న్యాయస్థానం ఆదేశాలతో నిలిచిపోయింది. తెలంగాణలో ఇంటర్ చదివిన విద్యార్థుల స్థానికత నిర్ధారణ విషయం కొలిక్కిరావడంతో ఈ నెల 14న ఏపీ ఈఏపీసెట్ చివరి విడత సీట్ల కేటాయింపు జాబితాను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 20లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని తెలిపింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఇప్పటికే దాదాపుగా కళాశాలల్లో చేరారు. తుది విడత నోటిఫికేషన్ ఆధారంగా కళాశాలల మార్పు, కొత్తగా ఆప్షన్ల నమోదు చేసుకున్న విద్యార్థులకు సీట్ల కేటాయింపు పూర్తయ్యాక తరగతులు ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది.

20 నుంచి తరగతులు

రెండు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఈ నెల 20 నుంచి తరగతులను ప్రారంభించేందుకు కళాశాలల యాజమాన్యాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చాలావరకు కళాశాలలతోపాటు ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీల్లో కూడా ఇప్పటికే ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయి. 36 కళాశాలల్లో కన్వీనర్ కోటాలో అంటుబాటులో ఉన్న 30,240 సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయినట్లు తెలుస్తోంది. ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలతో పాటు ప్రముఖ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ సహా అన్ని బ్రాంచ్‌లలో సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయి. తృతీయ శ్రేణి కళాశాలల్లో సీఎస్‌ఈ మినహా మిగిలిన బ్రాంచ్‌లలో పరిమిత సంఖ్యలో సీట్లు మిగిలినట్లు ఆయా కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కళాశాలల్లో సీట్ల భర్తీకి గతంలో మూడు, నాలుగు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం రెండు దశల్లోనే సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయి.

క్షణంలో జీవ'కళ' ఉట్టిపడేలా..!

- మోదుకూరు వాసికి మరో జాతీయస్థాయి అవార్డు
- '24 ఫ్రేమ్స్ ఫొటోగ్రఫీ'తో దక్షిణాదిలో ఇప్పటికే గుర్తింపు
- 19న వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ప్రత్యేక కథనం



టైమ్స్ బిజినెస్ అవార్డును స్వీకరిస్తున్న ఫణి

తెనాలి : సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకత... రెండూ అవసరమైన కళ ఫొటోగ్రఫీ. భావోద్వేగాలను ఒక్క క్షణంలో కెమెరా కన్నుతో ఒడిసిపట్టటం అంత సులువేం కాదు. అంతటి క్లిష్టమైన కళలో అసాధారణ ప్రతిభ చాటుతున్నారు ఫణి గోగిరెడ్డి. తాజాగా జాతీయ స్థాయిలో మరో అవార్డును కైవసం చేసుకున్నారు. వివాహ వేడుకల చిత్రీకరణలో దక్షిణ భారతదేశంలోనే మంచి బ్రాండ్లలో ఒకటిగా ఫణి గోగిరెడ్డికి చెందిన '24 ఫ్రేమ్స్ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ' గుర్తింపు పొందింది. డెస్టినేషన్ వివాహాల చిత్రీకరణలోనూ తనకు తానే సాటి అనిపించుకున్నారు. పెళ్లి వేడుకల్లో ఆయన తీసే ఫొటోలు ఆ వేడుకకే వన్నె తెస్తాయి. అద్భుత అనుభూతుల కథను చక్కగా చెబుతాయి. ఇప్పటికే పలు అవార్డులను అందుకున్న ఆయన తాజాగా టైమ్స్ బిజినెస్ అవార్డు-2025ను స్వీకరించారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి

చిన్న వయస్సులోనే గుర్తింపు పొందిన ఫణి గోగిరెడ్డి స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చుండూరు మండలంలో ఉన్న మోదుకూరు గ్రామం. పాఠశాలకు వెళ్లేటప్పుడే ఫొటోగ్రఫీపై ఆసక్తి ఉండేది. కంప్యూటర్ సైన్స్‌లో డిప్లొమా తర్వాత ఫొటోగ్రఫీ కోర్సు చేశారు. సినిమా రంగం వైపు వెళ్లి అసిస్టెంట్ కెమెరామెన్‌గా వృత్తి జీవితం ఆరంభించారు. సినిమాటోగ్రాఫర్‌గా 'ఎవడు', 'మిస్టర్ నూకయ్య', ''దూసుకెళతా', దేనికైనా రెడీ' తదితర పది సినిమాలకు పనిచేశారు. అందులో మూడున్నరేళ్ల పాటు ప్రముఖ సినీనటుడు, నిర్మాత మోహన్‌బాబు కంపెనీలో కొనసాగారు.

వినియోగదారులు మెచ్చేలా...

సొంత కంపెనీతో మరో ప్రస్థానం ఆరంభించారు. ఆయన స్థాపించిన 24 ఫ్రేమ్స్ అంటే హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ప్రసిద్ధ ఫొటోగ్రఫీ సంస్థగా పేరొచ్చింది. ఫణి గోగిరెడ్డి సీఈవోగా 2016లో ప్రారంభమైంది. వంద మందికిపైగా ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, సినిమాటోగ్రాఫర్లు, ఎడిటర్లు, క్రియేటివ్ లీడ్స్, హెచ్‌ఆర్ ప్రొఫెషనల్స్ బృందంతో వినియోగదారుల మన్ననలు పొందిందీ సంస్థ. వెడ్డింగ్ షూట్స్, ప్రీ వెడ్డింగ్ షూట్స్, డెస్టినేషన్ షూట్స్‌లో ప్రత్యేకత చాటుతోంది. ఆసియా, మిడిల్ ఈస్ట్ దేశాల వారి కోసం అమెరికాలోనూ బ్రాంచి నెలకొల్పారు. జూబ్లీహిల్స్‌లో ఆరు వేల అడుగుల కార్పొరేట్ ఆఫీస్‌ను ఈ మధ్యే ఆరంభించారు. ఇటీవల ఆయన స్థాపించిన 'అలంకార' ఈవెంట్ డెకార్ కంపెనీని యాంకర్ శ్యామల, ఈవెంట్స్‌ను మంచు మనోజ్ ప్రారంభించారు.

క్లుప్తంగా

మోటార్ బైక్‌ను ఢీకొట్టిన టూరిస్టు బస్సు

ఇద్దరు యువకులకు గాయాలు



వేటపాలెం: రోడ్డు పక్కన ఆగి ఉన్న మోటార్ బైక్‌ను వెనక నుంచి వచ్చిన టూరిస్టు బస్ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. జాతీయ రహదారి 216 బైపాస్ రోడ్డులో పొట్టి సుబ్బయ్యపాలెం జంక్షన్ వద్ద ఆదివారం సంఘటన చోటు చేసుకుంది. తెనాలి వైపు నుంచి నెల్లూరు వెళుతున్న టూరిస్టు బస్ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన బైక్ ఆపుకుని ఉన్న రాపూరి బాలాజీ, డేవిడ్‌లను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడటంతో తలలకు గాయాలయ్యాయి. స్థానికులు 104కు సమాచారం ఇవ్వగా, యువకులను అంబులెన్స్‌లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్ బాపట్లలో నిర్వహణ

రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌ను త్వరలో బాపట్లలో నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ఈసీ మీటింగ్‌లో వజీర్ మాట్లాడుతూ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. వెటరన్స్ అథ్లెటిక్ మీట్‌కు శాప్ నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామన్నారు. సీనియర్ అథ్లెట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర పోటీల్లో విజేతలను త్వరలో రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మాదిలేటి రెడ్డి, నజీర్, గిరి, డాక్టర్ పురుషోత్తం, నగేష్ ఖన్నా, లక్ష్మి, మల్లికా తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మంగళగిరి క్రీడాకారుల ప్రతిభ



మంగళగిరి టౌన్: ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్-2025 పోటీల్లో మంగళగిరికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారని కోచ్ డి.ప్రభాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిద్ధార్థ కరాటే అకాడమీ ఒంగోలులో నిర్వహించిన 43 యూనివర్సిటీ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఆదివారం మంగళగిరికి చెందిన క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అండర్-10 విభాగంలో హర్ష గోల్డ్ మెడల్, జయదేవ్ బ్రాంజ్ మెడల్, అండర్-9 విభాగంలో నిఖిలేష్ బ్రాంజ్ మెడల్, అండర్-7 విభాగంలో ఈశ్వర్ బ్రాంజ్ మెడల్, అండర్-14 విభాగంలో చరణ్ బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. బాలికల అండర్-7 విభాగంలో శ్రీవల్లి సిల్వర్ మెడల్, శ్రీదుర్గ బ్రాంజ్ మెడల్, అండర్-9 బాలికల విభాగంలో ఉపజ్ఞ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను మంగళగిరి ఎంఎంకే స్టేడియం ప్రతినిధులు అభినందించారు.

రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసిన కూటమి ప్రభుత్వం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ
- పార్టీ జిల్లా మహాసభలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ. వేదిక పై పార్టీ నాయకులు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రూ.1.75 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సీపీఐ గుంటూరు జిల్లా 26వ మహాసభలు ఆదివారం గుంటూరులో ప్రారంభమయ్యాయి. తొలుత బీఆర్ స్టేడియం నుంచి సీపీఐ జిల్లా కార్యాలయం వరకు ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ సంవత్సర కాలంలో 21 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలన్నీ కచ్చితంగా అమలు చేయాల్సిందేనని అన్నారు. నూతన బస్సులు కొనుగోలు చేయకుండా, తగిన సిబ్బంది నియామకం జరగకుండా మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తాము చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. రాజధానికి మరో 40 వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. లూలూ కంపెనీకి రూ.400 కోట్ల విలువైన భూములను 99 సంవత్సరాలపాటు లీజుకు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. 2029 నాటికి పేదరికం పోతుందని చంద్రబాబు చెబుతున్నారని, ఇటువంటి విధానాలతో పాలన చేస్తే 1000 ఏళ్లకు కూడా పేదరికం పోదని స్పష్టం చేశారు. ఒంగోలులో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభలకు గుంటూరు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని విస్మరించి, అసలు పోరాటంలో భాగస్వాములు కాని ఆర్‌ఎస్‌ఎస్ వారి గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దొంగ ఓట్లు- దొంగ నోట్ల రాజ్యం ప్రస్తుతం దేశంలో నడుస్తోందని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు ఆయుధంగా ఇచ్చిన ఓటు హక్కును రద్దు చేస్తున్నారన్నారు. దొంగ ఓట్ల వ్యవహారంపై దేశమంతా చర్చ జరుగుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, పవన్, దీనిపై స్పందించకపోవడం శోచనీయమన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్ కూడా బీజేపీతో లాలూచీ పడిందని, సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటే గాని ఓటర్ లిస్టు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతర వేశారని విమర్శించారు. మోదీ పాలనలో అంబానీ, అదాని వంటి కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారులు ప్రపంచ కుబేరులుగా ఎదిగారని దుయ్యబట్టారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నగర కార్యదర్శి అరుణ్‌కుమార్, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు చేతుల్లో పెట్టొద్దు!

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.టి.వలి



మాట్లాడుతున్న వలి

బాపట్ల: ఆర్టీసీ స్థలాన్ని షాపింగ్ మాల్స్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 137ను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.టి.వలి డిమాండ్ చేశారు. బాపట్లలోని ప్రభుత్వ పెన్షనర్స్ బిల్డింగ్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవడం కోసం అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రజా రవాణా సంస్థ ఆస్తులను ప్రైవేటు వ్యాపార సంస్థలకు ధారాదత్తం చేయడం అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. విజయవాడ నగర నడిబొడ్డునున్న గవర్నర్‌పేట డిపోలు, పాత బస్టాండ్‌కు చెందిన నాలుగు ఎకరాల స్థలం సుమారు రూ.400 కోట్ల విలువ చేస్తుందని, దాన్ని లులు షాపింగ్ మాల్‌కు అప్పగించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ రెండు డిపోల్లో 200 బస్సులు, 1100 మంది ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీటన్నింటినీ పట్టించుకోకుండా ప్రైవేట్ వ్యాపారవేత్తలకు లబ్ధి చేకూర్చడాన్ని ప్రజలు సహించరని వలి విమర్శించారు.బాపట్ల జిల్లా మాజీ కార్యదర్శి వై.ఎస్. రావు మాట్లాడుతూ 1959లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించిన గజం రూ.16 ధరతో, సుమారు రూ.4.60 లక్షలకు ఆర్టీసీ యాజమాన్యం ఈ భూమిని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఇంత విలువైన ప్రజా ఆస్తిని కొద్ది మంది వ్యాపారవేత్తల చేతుల్లోకి ఇవ్వడం చరిత్రలోనే పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. సమావేశంలో బాపట్ల జిల్లా కార్యదర్శి పి.కమలాకర్‌రావు, నెల్లూరు జోనల్ మహిళా నాయకురాలు పి. రజిని, ఎం.పి. కుమార్, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. చింపనయ్య, బాపట్ల డిపో ప్రెసిడెంట్ టి. చంద్రశేఖర్, సెక్రటరీ వై.ఎస్. రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.ఎస్. రావు పాల్గొన్నారు.

తుంగభద్ర డ్రెయిన్‌లో కొట్టుకుపోయిన యువకుడు



డ్రెయిన్‌లో వెదుకుతున్న గజ ఈతగాళ్లు

చుండూరు(వేమూరు): తుంగభద్ర డ్రెయిన్‌లో యువకుడు కొట్టుకుపోయిన ఘటన ఆదివారం ఉదయం మండలంలోని దుండిపాలెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామానికి చెందిన యడ్లపల్లి ప్రశాంత రాజు (20) ఉదయం కాళ్లు శుభ్రం చేసేందుకు తుంగభద్ర డ్రెయిన్ వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో జారి మునిగిపోయాడు. రేపల్లె ఆర్డీవో, చుండూరు మండలం తహసీల్దారు సంఘటన స్థలం వద్దకు వచ్చారు. వెంటనే గజ ఈతగాళ్లను పిలిపించి వెతికించినా, ప్రశాంత రాజు ఆచూకీ దొరకలేదు. సోమవారం కూడా వెదకడం ప్రారంభిస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల నేతలు తీర్మానం
- మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని..



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

వినుకొండ: గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్‌తో అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. వినుకొండ జాషువా కళా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అధ్యక్షతన వివిధ గిరిజన సంఘాల ముఖ్య నాయకులతో, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ రాష్ట్రంలో లక్షలాది మంది గిరిజనులు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని తెలి పారు. ఇప్పటికీ రేషన్, ఆధార్ కార్డులు లేక దుర్భర మైన జీవితాలు గడుపుతున్నారని పేర్కొన్నారు. నేటికి ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారని చెప్పారు. గిరిజనుల అభ్యున్నతికి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులు దారి మళ్లించకుండా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, బీఎస్పీ కార్యదర్శి రాజు, పల్నాడు జిల్లా యువజన నాయకుడు జరపల కృష్ణా నాయక్, యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు రంగ నాయక్, గౌరవ అధ్యక్షుడు విష్ణు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నేత బాలాజీ నాయక్, డాక్టర్ కోటేశ్వరరావు నాయక్, ఒంగోలు జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్, మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సామి, రేమిడిచర్ల సర్పంచ్ బ్రహ్మం, రాంజీ నాయక్, వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు.

భర్త రెండో పెళ్లిపై భార్య ఫిర్యాదు

తెనాలి రూరల్: భార్యకు విడాకులివ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన లింగంశెట్టి ఉమామహేశ్వరరావు 2003లో భూలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. ఆమెకు విడాకులివ్వకుండానే 2012లో మరో మహిళను వివాహం చేసుకోగా ఇద్దరు కుమార్తెలు కలిగారు. రెండో భార్య కుమార్తెల పేరున ఉమామహేశ్వరరావు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకుని ఆస్తి రాసిచ్చి రిజిస్ట్రేషన్ చేయించాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య భూలక్ష్మి ఆధారాలతో పోలీసును ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

ఆటో: ద్విచక్ర వాహనం ఢీ

- ముగ్గురుకి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన కిరణ్, జోసఫ్

పెదకూరపాడు: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలోని పెదకూరపాడు- లింగంగుంట్ల మధ్య ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాటిబండ్లకు చెందిన మన్నవ జోసఫ్, జలాల్‌పురం గ్రామానికి చెందిన మన్నవ కిరణ్‌లు పెదకూరపాడు వచ్చి తిరిగి వెళుతున్నారు. ఇదే సమయంలో పొడపాడు నుంచి ఆటోలో ప్రయాణికులతో సారెకుక్క జోసఫ్ పెదకూరపాడు వస్తున్నాడు. ఈ క్రమంలో పెదకూరపాడు-లింగంగుంట్ల వద్ద మూల మలుపులో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న జోసఫ్, కిరణ్‌లు నాలుగు అడుగులు మేర ఎత్తుకు ఎగిరి రోడ్డుపై పడ్డారు. జోసఫ్‌కు తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. కిరణ్ తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆటో డ్రైవర్ సారెకుక్క జోసఫ్‌కు కూడా గాయాలయ్యాయి. ప్రయాణికులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో గాయపడిన వారిని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరుకు తరలించారు. ఇందులో కిరణ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు

ఈత పోటీల్లో ప్రతిభ చూపుతున్న తల్లీకుమారులు క్వీన్ విక్టోరియా, స్టీఫెన్‌కుమార్‌లకు ఘనసన్మానం



క్వీన్ విక్టోరియాకు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ

తాడేపల్లిరూరల్: ఉండవల్లి అమరావతి కరకట్టపై గల ఆక్వా డెవిల్స్ అసోసియేషన్‌లో స్విమ్మింగ్ కాంపిటేషన్‌ను ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు లింగిపల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఉన్న కృష్ణానదిలో ఓపెన్ వాటర్‌లో ప్రాక్టీస్ చేసి ప్రపంచంలోని పలు సముద్రాలను ఈదుతున్న క్వీన్ విక్టోరియా, ఆమె కుమారుడు స్టీఫెన్ కుమార్‌లు 1.5 కి.మీ. కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ కాంపిటేషన్‌లో పాల్గొన్నారని తెలిపారు. ప్రపంచంలోని ఏడు సముద్రపు చానల్స్‌లో భాగంగా రెండవది అయిన అమెరికాలోని మెయిన్ ల్యాండ్ నుంచి సౌత్ కాలిఫోర్నియా బీచ్ వరకు 33.5 కి.మీ స్విమ్మింగ్ చేయడానికి సెప్టెంబర్ నెలలో వెళ్తున్న సందర్భంగా ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం అసోసియేషన్ లైఫ్ చైర్మన్ గోకరాజు గంగరాజు సూచన మేరకు వారికి రూ. 25,116 చెక్కును అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి వై.వి. రమేష్ కుమార్‌మాట్లాడుతూ క్వీన్ విక్టోరియా తన పిల్లలను శిక్షణ శిబిరంలో చేర్పించి, తాను కూడా పిల్లలతో పాటు ఈత నేర్చుకుని మాస్టర్ స్విమ్మింగ్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఉన్న కృష్ణానదిలో ఓపెన్ వాటర్‌లో ప్రాక్టీస్ చేసి ప్రపంచంలోని సముద్రాలను ఈదుతున్న మొట్టమొదటి తెలుగు మహిళ , ఆమె కుమారుడు ఆక్వా డెవిల్స్ గౌరవ సభ్యులు కావడం గర్వకారణమన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోపాలం సాంబశివరావు, సహాయ కార్యదర్శి ఎ.రామిరెడ్డి, కోశాధికారి కె.వి. రామయ్య, కార్యవర్గ సభ్యులు కె.సాంబశివరాజు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, కర్రిసాంబయ్య, పి.శ్రీనివాసులు, కె.ఆశీర్వాదం, అబ్దుల్ గఫూర్ తదితరులు క్వీన్ విక్టోరియా, స్టీఫెన్ కుమార్‌లను అభినందించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వంశీకృష్ణారెడ్డి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా అమెచ్యూర్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లిథమ్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఈ.వంశీకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్లలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అమెచ్యూర్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి జిల్లా ముఖ్య శిక్షణ అధికారి పి. నర్సింహారెడ్డి పర్యవేక్షణ అధికారిగా క్రీడా కోడ్- 2011 అనుసరించి ఎన్నికల నిర్వహించడానికి నిర్ణ యించారు. సమావేశానికి సాఫ్ట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.కృష్ణకిశోర్‌రెడ్డి, పి.శివపార్వతి వ్యవహరించారు. సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి. రమణ, రాష్ట్ర ఎగ్జిక్యూ టివ్ మెంబర్ బి.లక్ష్మీప్రసన్న పర్యవేక్షణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా న్యాయవాది ఎస్.వి. రమణారెడ్డి వ్యవహరించారు.ఉమ్మడిగుంటూరు జిల్లా అమెచ్యూర్ సాఫ్ట్ బాల్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఈ. వంశీకృష్ణా రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంతోష్ ప్రభుకుమార్, కార్యదర్శిగా పి. సామంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా నర్రా శ్రీనివాస్, కోశాధికారిగా ఏ. జనార్దన్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వి.శబరినాథ్, పి. శివపార్వతి, బి. యామిని, వై. రంజాన్‌బీలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పూల మాలలు, దుశ్శాలువలతో సత్కరించారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి నియామకం కోసం ఆసక్తి, అర్హత కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విడుదల చేసిన విధి, విధానాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన పీఈటీలు, స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్) పూర్తి వివరాలతోపాటు నమూనా దరఖాస్తును డీఈవో గుంటూరు బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో సందర్శించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంతో అందజేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



వైద్యశాలలో ఉన్న సుబ్బారావు మృతదేహం

తెనాలి రూరల్: తెనాలి సుల్తానాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. అంగలకుదురులో కిరాణా షాపు నిర్వహించే పువ్వాడ సుబ్బారావు(72) రోడ్డుపై నడుచుకుంటూ తెనాలి నుంచి అంగలకుదురు వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు వేగంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో సుబ్బారావు తీవ్రంగా గాయపడగా, తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులిచింతలకు 2,04,138 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 11 క్రస్ట్ గేట్ల ద్వారా 2,04,138 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్ పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 11 క్రస్ట్ గేట్లు 3.5 మీటర్లు ఎత్తు ఎత్తి 2,04,138 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 75.33 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకు గాను ప్రస్తుతం 6.963 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 59.80 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువ నున్న నాగార్జునసాగర్ నుంచి 1,99,781 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ఎన్‌ఆర్ఐ మహిళ బ్యాగ్ చోరీ

పట్నంబజారు: ఎన్‌ఆర్ఐ మహిళ బ్యాగ్ చోరీ అయిన ఘటన గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం.. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ మహిళ గుంటూరుకు చేరుకున్నారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దిగిన తర్వాత వేరే ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆమె బ్యాగ్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై పాత గుంటూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. సుమారు పాతిక సవర్లకు పైగా, పెద్ద ఎత్తున నగదు దోచుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ అంశాన్ని పాత గుంటూరు పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఏ ఒక్కరికీ తెలియకుండా, మీడియాకు సమాచారం తెలియకుండా దాచిపెట్టారు. ఇప్పటికే పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గత పది రోజుల్లో భారీ చోరీలు జరిగాయి. ఈ నేపథ్యంలో అధికారులు సమాచారాన్ని మీడియాకు తెలియకుండా దాచి ఉంచారని సమాచారం.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

- వారాల వడ్డీలే కారణమంటున్న స్థానికులు
- ఇన్స్యూరెన్స్ డబ్బుల కోసమే హత్యచేశారంటున్న బంధువులు
- కేసు నమోదు చేసిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నులకపేట మసీదు వద్ద నివాసముండే ఓ ఒంటరి మహిళ తన నివాసంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన చక్కా ఉమామహేశ్వరరావు, మహాలక్ష్మి (41) కొన్నేళ్ల కిందట తాడేపల్లిలోని నులకపేట వచ్చి నివాసముంటున్నారు. గత సంవత్సరం ఉమామహేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందడంతో మహాలక్ష్మి ఒంటరిగా జీవిస్తోంది. గతంలో భర్త చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు విజయవాడకు చెందిన కొంతమంది దగ్గర వారాల వడ్డీకి తీసుకుని, ఆ వడ్డీని చెల్లించింది. వారాల వడ్డీ ఇచ్చిన వారు ఆ మహిళను వేధించడం, అసభ్యంగా మాట్లాడడం, ఒంటరిగా ఉంటున్న మహిళకు తోడుగా ఉంటామని అనడం, పలుమార్లు వారాల వడ్డీకి ఇచ్చిన వారు పలువురు రాజకీయ నాయకులతో పంచాయితీకి పిలిపించడంతో మహాలక్ష్మి మనస్తాపానికి గురైంది. మరోపక్క భర్త ఉమామహేశ్వరరావు మరణించిన అనంతరం వచ్చిన ఇన్స్యూరెన్స్ డబ్బులు తమకు ఇవ్వాలని, నువ్వు ఏం చేసుకుంటావని అతని బంధువులు ఆమెను మానసికంగా హింసించినట్లు స్థానికులు చెబుతున్నారు. మహాలక్ష్మి భర్త చనిపోవడం, పిల్లలు లేకపోవడంతో ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుందంటూ సమీప బంధువులు తెలిపారు. ఆ ఇన్స్యూరెన్స్ డబ్బుల కోసమే ఉమామహేశ్వరరావు బంధువులు ఆమెను హత్య చేసి ఉంటారని మరికొంతమంది ఆరోపిస్తున్నారు. సంఘటనపై తాడేపల్లి పోలీసులను వివరణ కోరగా సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా సుమోటో కింద కేసు నమోదుచేశామని, మహాలక్ష్మి మృతి పట్ల కొన్ని అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

'విట్' విద్యార్థులకు అండగా ఉంటాం

- ఆహార నాణ్యతపై ప్రశ్నించిన విద్యార్థులను బెదిరించిన రిజిస్ట్రార్ తీరు దుర్మార్గం
- ఏఎన్‌యూ ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నాసరయ్య

తాడికొండ: విట్ యూనివర్సిటీలో ఆహారం నాణ్యత లేకుండా అందిస్తుండటంపై విద్యార్థులు చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నాసరయ్య అన్నారు. విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడి తాను ధైర్యం చెప్పినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రస్తుత రాజధాని ప్రాంతంలో విట్ యూనివర్సిటీలో నాసిరకంగా ఆహారం ఉందని, క్యాంటీన్‌లో తిందామంటే.. అంటే అక్కడ కూడా వ్యర్థపు వాసన వస్తున్నాయని విద్యార్థులు అందరూ కలిసి ధర్నా చేస్తే, వారిని రిజిస్ట్రార్ బెదిరించడం దుర్మార్గమన్నారు. విద్యార్థులను చంపి అక్కడే పాతి పెడతా అని రిజిస్ట్రార్ అనడం దుర్మార్గమన్నారు. ఇదేమని పోలీసులు వచ్చి అడగడం.. రిజిస్ట్రార్ ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలతో యూనివర్సిటీ ప్రాంతం అంతా మార్మోగిపోవడంపై అభినందించారు. సమస్యకు పరిష్కారం చూపకపోతే విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మరాఠా కల్యాణం.కామ్ వెబ్‌సైట్ ప్రారంభం



మరాఠా రాష్ట్ర సంఘం లోగోను ఆవిష్కరిస్తున్న నేతలు

గుంటూరు మెడికల్: మరాఠా రాష్ట్ర సంఘం -ఆంధ్ర ప్రదేశ్ రిజిస్టర్డ్ కమిటీ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం గుంటూరు అరండల్‌పేటలో జరిగింది. సమావేశంలో సంఘం లక్ష్యాలు, గత ఏడాది కాలంలో చేసిన పనులు గురించి చర్చించారు. మరాఠా రాష్ట్ర సంఘం ఏపీ శాఖ అధికారిక చిహ్నం(లోగో)ను సంఘం గౌరవ అధ్యక్షుడు గంగాధరరావు తెన్నేటి ఆవిష్కరించారు. మరాఠాల వివాహ సంబంధాల విషయంలో ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యను సంఘం గమనించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మరాఠా కల్యాణం.కామ్ వెబ్‌సైట్‌ను సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సింధే రవిచంద్రరావు, ఉపాధ్యక్షుడు కదం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అన్ని భాషల్లో రూపొందించిన ఈ వెబ్‌సైట్ సేవలు దేశంలోని మరాఠాలు అందరూ ఉచితంగా పొందవచ్చునని మరాఠా రాష్ట్ర సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మరాఠా వెంకట్ సోమాజీ తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వెంకటేశ్వరరావు డుమ్మే, ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు మోతే, సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్లోజి జాదవ్, సెక్రెటరీ హరినాథ్‌రావు జాదవ్, జాయింట్ సెక్రటరీ శంకరరావు మోరే, ఉప కోశాధికారి కదం రామచంద్రుడు పాల్గొన్నారు.